క్లుప్తంగా

ఇడా చైర్మన్ బొద్దానికి అభినందనలు



శ్రీనివాసరావుకు బొకే అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (ఇడా) చైర్మన్‌గా నియమితులైన వైఎస్సార్ సీపీ ఏలూరు నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాసరావుకి వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా నాయకులు బుధవారం అభినందనలు తెలిపారు. ఆయన స్వగృహంలో కలిసి బొకే అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ డీవీ రామాంజనేయులు, ఆచంట వెంకటేశ్వరరావు, సీహెచ్ రాజేంద్రప్రసాద్, ప్రభుత్వ ప్లీడర్ బి.జగన్నాథరెడ్డి, పార్టీ లీగల్ సెల్ నాయకులు పితాని దుర్గాప్రసాద్, వీవీ సాయిరామారావు, ఆర్యవైశ్య నాయకులు మోటమర్రి సదానంద కుమార్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ వినతి

ఏలూరు టౌన్ : ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రతినెలా 1వ తేదీన జీతాలు చెల్లించాలని, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎమ్మెల్యే ఆళ్ల నానికి యూటీఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నానిని వారు కలిసి తమ సమస్యలను వివరించారు. యూటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తాఫా అలీ, ఆర్ రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, జిల్లా కోశాధికారి జీవీ రంగమోహన్, జిల్లా కార్యదర్శి ఈ.శివశంకరరావు ఉన్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి



ఏలూరు టౌన్: ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని మహిళను గూడ్స్ రైలు ఢీకొనడంతో మృతి చెందింది. ఏలూరు రైల్వే ఎస్సై డి.నర్సింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని మహిళను గూడ్స్ రైలు ఢీ కొనడంతో మృతి చెందింది. మృతురాలు ఎత్తు 5.5 అడుగులు, కోల ముఖం కలిగి ఉంది. ఆమె ఒంటిపై గంధం ఆకుపచ్చ రంగు డిజైన్, లేత బిస్కెట్‌రంగు చీర, గంధం రంగు జాకెట్, ఆకుపచ్చ రంగు లంగా ధరించి ఉంది. మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. వివరాలు తెలిసిన వారు సెల్ నెంబర్ 95020 97672లో సంప్రదించాలని రైల్వే ఎస్సై కోరారు.

హోటళ్లలో విజిలెన్స్ తనిఖీలు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో పలు హోటళ్లపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజనల్ అధికారి కరణం కుమార్ ఆదేశాల మేరకు ఏలూరు ఎన్ఆర్‌పేటలోని మూడు హోటళ్లలో తనిఖీ చేశారు. చికెన్ ఫ్రై బిర్యానీ, చికెన్ బిర్యానీ, చికెన్ ఫ్రై వంటి వాటిలో కృత్రిమ రంగులు కలిపినట్లు వచ్చిన సమాచారం మేరకు తనిఖీ చేశారు. మూడు బిర్యానీ పాయింట్లల్లో నమూనాలను సేకరించి విశ్లేషణ కోసం ల్యాబ్‌లకు పంపించారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ పి.శివరామకృష్ణ, ఎస్సై సీహెచ్ రంజిత్‌కుమార్, తహసీల్దార్ బి.కన్యాకుమారి, ఏఓ పి.సురేష్, హెచ్‌సీ కె.వెంకటేశ్వరరావు, ఆహార పదార్థాల తనిఖీ అధికారులు రామరాజు, కావ్యారెడ్డి ఉన్నారు.

23, 24 తేదీల్లో పిల్లల సంబరాలు

ఏలూరు (టూటౌన్): హేలాపురి బాలోత్సవం 4వ పిల్లల సంబరాలు ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించనున్నట్టు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. బాలోత్సవం కార్యక్రమాలను స్థానిక సురేష్ చంద్ర బహుగుణ (పోలీస్) స్కూల్లో నిర్వహిస్తామన్నారు. అకడమిక్, కల్చరల్ విభాగాల్లో సుమారుగా 69 అంశాల్లో ప్రతిభా పాటవాలు ప్రదర్శించే అవకాశాలు ఇచ్చామని తెలిపారు. వేమన పద్యాల పుస్తకం, స్కూల్స్‌కు అందజేసే సావిత్రిబాయి పూలే చిత్రపటాలు ఆవిష్కరణ, వెయ్యిమందికి పైగా విద్యార్థులతో చదవాలిరా ఎన్ని ఆటంకాలు వచ్చినా పాట సామూహిక ఆలాపన ద్వారా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో హేలాపురి బాలోత్సవం నమోదు కానున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా బాలోత్సవం వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో గుడిపాటి నరసింహారావు, పిన్నాక ఆంజనేయులు, వి.సురేష్, ఎం అజయ్‌బాబు, జి.శారద, కె.శ్రావణి కుమారి, పి.ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఐటీఐ రెండేళ్లు చదివి 60 మార్కులతో పాసైన విద్యార్థులు నేరుగా పాలిటెక్నిక్ కోర్సులో రెండో సంవత్సరంలో చేరడానికి బ్రిడ్జి కోర్సు నిర్వహిస్తున్నట్టు ఏలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రధానాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన ప్రభుత్వ ఐటీఐల్లో జనవరి 2వ తేదీ నుంచి 31 వరకు ఈ బ్రిడ్జి కోర్సు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 3 వరకు ఆయా సంస్థల్లో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో జరిగే ప్రవేశ పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుందని వివరించారు. వివరాలకు తమ సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల ప్రధానాధికారులను సంప్రదించవచ్చని తెలిపారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే ఆళ్ల నాని





ఏలూరు 28వ డివిజన్‌లో మహిళలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యేనాని, క్యాంపు కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

ఏలూరు టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగరంలో 136వ రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం 28వ డివిజన్‌లో పుష్పలీలానగర్, రహ్మత్ వీధి, ఫరూక్ వీధుల్లో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ 28వ డివిజన్ నాయకులు కొలికిపాము తిరుపతిరావు, కొల్లిపర సురేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నాని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. వైఎస్సార్ సీపీది ప్రజాప్రభుత్వమని, ప్రజలే దేవుళ్లుగా భావిస్తూ వారికిచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో సీఎం జగన్ కృషి చేస్తున్నామని చెప్పారు. సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక కార్యాచరణతో పనిచేస్తూ సామాజిక సాధికారతకు బాటలు వేస్తున్న సీఎం జగన్‌కు మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. ఏలూరు నియోజకవర్గంలో ప్రతి పేదవాడికీ సొంతిల్లు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. విద్య, వైద్య రంగాలను అభివృద్ధి చేస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపాలన్నది జగన్ ఆకాంక్షని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్ బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు, పార్టీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, కార్పొరేటర్లు, సచివాలయ ఉద్యోగులు, నగర పాలక సంస్థ ఉద్యోగులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదం

ఏలూరు టౌన్ : ఏలూరు నగర ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో పనిచేస్తున్నామని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఇటీవల ఏలూరు 26, 27 డివిజన్లల్లో చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన వినతుల పరిష్కారంపై ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్షించారు. తంగెళ్లమూడి ప్రాంతంలో అభివృద్ధి పనులకు రూ.57 లక్షలు, శనివారపుపేట ప్రాంతంలో అభివృద్ధి పనులకు రూ.60 లక్షలు నిధులు ఖర్చు చేసేలా ఆమోదం తెలిపామన్నారు. ఒక్కో డివిజన్‌కు గడపగడప నిధులు రూ.40 లక్షలు ప్రభుత్వం మంజూరు చేయగా మిగిలిన సొమ్ము ఏలూరు నగరపాలక సంస్థ జనరల్ ఫండ్ నుంచి ఖర్చు చేయనున్నట్టు చెప్పారు. రోడ్లు, డ్రెయినేజీ కల్వర్టులు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు వెచ్చిస్తామన్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు పూర్తి చేసి వెంటనే పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే నాని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించాలన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాస్, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, కార్పొరేషన్ పీఏ మూర్తి, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ. 9.33 లక్షలు



ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి హుండీల ఆదాయం రూ.9,33,065 ఆదాయం వచ్చింది. ఆలయ కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఆదాయం లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ధర్మకర్తలు కిలారపు శ్రీనివాసరావు, చోడే శివ సాయికృష్ణ, శ్రీ కృష్ణ సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని అప్పనవీడు అభయాంజనేయ స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

ఇడా ఛైర్మన్‌గా బొద్దాని శ్రీనివాస్



ఎమ్మెల్యే నానిని కలిసిన ఇడా ఛైర్మన్ శ్రీనివాస్



అభిమానులు, పార్టీ కార్యకర్తల కోలాహలంలో ఎమ్మెల్యే నాని, ఇడా ఛైర్మన్ శ్రీనివాస్

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీలో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్త, నాయకుడికీ సముచిత స్థానం, గుర్తింపును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తారని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఇడా) ఛైర్మన్‌గా బొద్దాని శ్రీనివాస్ నియమితులయ్యారు. ప్రభుత్వం ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో బొద్దాని శ్రీనివాస్ తన కుటుంబం, పార్టీ అభిమానులు, నాయకులతో కలిసి భారీ సంఖ్యలో ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. ఎమ్మెల్యే నానిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. భారీ జనసందోహం మధ్య కోలాహలంగా గజమాలతో ఎమ్మెల్యే నానిని సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఏలూరు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ఆది నుంచి విశేష కృషి చేస్తున్న బొద్దాని శ్రీనివాస్‌కు కీలకమైన పదవి దక్కడం పట్ల పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పూల వర్షం కురిపిస్తూ, నృత్యాలతో, డప్పులతో తమ అభిమాన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జేజేలు పలికారు. ఈ సందర్భంగా ఇడా ఛైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల నానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన వారికి ఖచ్చితంగా గుర్తింపు ఉంటుందని, మరోసారి తనకు పదవి ఇవ్వడంతో స్పష్టమైందని ఆనందం వ్యక్తం చేశారు. ఏలూరు నియోజకవర్గం, జిల్లాలో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి తమ వంతు పాత్ర పోషిస్తూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొద్దాని అఖిలప్రియ, బొద్దాని కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు ఉన్నారు.

చైతన్యవంతంతోనే బీసీలకు రాజ్యాధికారం



సభలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్

ఏలూరు (టూటౌన్): బీసీలు చైతన్య వంతులైనప్పుడే రాజ్యాధికారం సాధించగలమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు అన్నారు. రాష్ట్రంలోని బీసీల హక్కులు, రాజ్యాధికారం కోసం శ్రీకాకుళం నుంచి తిరుపతి వరకు చేపట్టిన బీసీల స్వతంత్ర పోరాటం రథ యాత్ర బుధవారం సాయంత్రం ఏలూరు చేరింది. ఈ సందర్భంగా స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ముందుగా నివాళులర్పించారు. అక్కడ నుంచి జూట్ మిల్లు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో వెంగళరావు మాట్లాడారు. దేశంలో 60 శాతం ఉన్న బీసీలకు నేటికీ నిజమైన స్వాతంత్ర్యం రాలేదన్నారు. రాష్ట్రంలో 140 బీసీ కులాలు ఉంటే కేవలం 15 కులాల వారే లబ్ధి పొందుతున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో 90 అసెంబ్లీ, 13 ఎంపీ స్థానాలు, దేశంలో 275 ఎంపీ స్థానాలు బీసీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీ ప్రధానిగా ఉన్న నరేంద్ర మోదీ బీసీలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. ఇటీవల పార్లమెంటులో ప్రవేశ పెట్టిన మహిళా బిల్లులో బీసీలకు సబ్ కోటా పెట్టాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ ఎలగా నూకాలమ్మ మాట్లాడుతూ బీసీల్లో చైతన్య కల్పించడమే ధ్యేయంగా రథ యాత్ర చేపట్టారని అన్నారు. బీసీ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు.

జగన్ హయాం బీసీలకు స్వర్ణయుగం

రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిళ్లం గోళ్ల శ్రీలక్ష్మి మాట్లాడుతూ బీసీలకు రాజ్యాధికారం దక్కిన నాడే పూలే కన్న కలలు నిజం చేసిన వారమవుతామని అన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే ఆశయాలకు అనుగుణంగా నేడు రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వం పాలన కొనసాగుతుందని చెప్పారు. వైఎస్సార్ సీపీ హయాంలో బీసీలకు స్వర్ణయుగంగా చెప్పవచ్చన్నారు. సభాధ్యక్షుడు లక్కోజు రాజగోపాలచారి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. ప్రతి బీసీ కుల సంఘానికీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి స్థలం కేటాయించారని, ఏలూరు కార్పొరేషన్‌లో 50 శాతం కార్పొరేటర్లుగా బీసీలకు అవకాశం ఇచ్చిన ఘనత నానికే దక్కుతుందని తెలిపారు. ఆలయ కమిటీల చైర్మన్లుగా, మార్కెట్ కమిటీ చైర్మన్, మేయర్ వంటి పదవులు బీసీలకు ఇచ్చారన్నారు. బీసీల పక్షపాతి ఆళ్ల నాని అంటూ కొనియాడారు. సభలో వివిధ బీసీ సంఘాల నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ, బాయి వెంకట్రావు, అబ్బిరెడ్డి రంగ ముత్యాలు, మెగా దుర్గారావు, తాతపూడి చందు, చిరంజీవి, చిదరబోయిన శ్రీనివాసరావు, కిలారి బుజ్జి, ఆలమండ రామారావు, కింజంగిరాజు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో 40 బీసీ కులాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జూట్ మిల్లు సెంటర్‌లో పూలే దంపతుల విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

27 నుంచి కుష్టు కేసుల గుర్తింపు



కుష్టు నిర్మూలన అవగాహన కరపత్రం విడుదల చేసిన డీఆర్ఓ వెంకటేశ్వర్లు

ఏలూరు(మెట్రో): జాతీయ కుష్టువ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 27వ తేదీ నుంచి జనవరి 12 వరకు ఇంటింటి సర్వే చేసి కుష్టు కేసులను గుర్తించనున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన సంబంధిత జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కుష్టువ్యాధి నివారణ, వ్యాధి లక్షణాలపై అవగాహన కలిగించే కరపత్రం విడుదల చేశారు. కుష్టు కేసులను గుర్తింపు కార్యక్రమానికి మండల, గ్రామ స్థాయి అధికారులు సహకరించాలని డీఆర్ఓ కోరారు. ఇంటింటి సర్వేకు సంబంధించి పారా వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు భాగస్వాములు కావాలన్నారు. జిల్లాలో ఏప్రిల్ 2022 నుంచి ఇప్పటి వరకు 63 కొత్త కేసులు నమోదై వైద్యం పొందుతున్నారని చెప్పారు. జిల్లాలో 334 మంది కుష్టు బాధితులకు మల్టీ డిఫరమెటి పెన్షన్లు ప్రతినెలా అందిస్తున్నట్టు తెలిపారు. కుష్టు లక్షణాలను తొలిదశలోనే గుర్తిస్తే, అందుకు అవసరమైన చికిత్సా విధానం అందుబాటులో ఉందని చెప్పారు. అనుమానిత లక్షణాలు ఉంటే సర్వేకు వచ్చే ఆరోగ్య కార్యకర్తలకు చూపించుకోవాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, పట్టణ ఆరోగ్యకేంద్రం ఆరోగ్య కార్యకర్త వద్దా ఎండీటీ మందులు ఉచితంగా లభిస్తాయని తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్ఓ ఎస్ శర్మిష్ట, డిప్యూటీ డీఎంహెచ్ఓ ఎం నాగేశ్వరరావు, ఏలూరు ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ ఎస్ నిర్మలాజ్యోతి, పలువురు కమిటీ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి



బహుమతులు అందుకున్న విజేతలతో డీఈఓ శ్యామ్‌సుందర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్ ఉపాధ్యాయులకు సూచించారు. కౌశల్ 2023 జిల్లా స్థాయి క్విజ్, పోస్టర్ ప్రెజెంటేషన్ ముగింపు వేడుక బుధవారం స్థానిక సుబ్బమ్మదేవి స్కూల్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్యామ్ సుందర్ మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞాన శాస్త్రం పట్ల ఆసక్తిని పెంచుకొని భవిష్యత్ తరాల్లో శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. కౌశల్ జిల్లా సమన్వయకర్త స్వర్ణ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్విజ్, పోస్టర్ ప్రజంటేషన్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు ఈనెల 30న విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కోఆర్డినేటర్ ఎస్వీఎస్ సోమయాజులు, సుబ్బమ్మదేవి నగర పాలకోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుటుంబరావు, వేల్పుచర్ల ప్రధానోపాధ్యాయులు ఎం. శ్రీనివాస్, దేవరకొండ ప్రధానోపాధ్యాయిని గద్దె రమాదేవి కౌశల్ జిల్లా ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

క్విజ్ : జి.ప్రసన్న రాణి, బి.ఈశ్వర్ నాయక్, వీ.సామంత్ కుమార్ (పల్లెర్లమూడి జిల్లా పరిషత్ హైస్కూల్) ప్రథమ, యూఎస్‌కే హర్షిత్, పి.సుధారాణి, సీహెచ్ దివ్య (నిడమర్రు ప్లస్ జిల్లా పరిషత్ హైస్కూల్) ద్వితీయ, ఎస్ సాయినాథ్, సీహెచ్ సంసిత, యశ్వంత్, కె.శృతి (జంగారెడ్డిగూడెం మండలం జి.పంగిడిగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్) తృతీయ స్థానాల్లో నిలిచారు.

పోస్టర్ ప్రజెంటేషన్ పోటీల్లో థీమ్–1 : సీహెచ్ నిఖిల (నూజివీడు జిల్లా పరిషత్ బాలిక హైస్కూల్) ప్రథమ, టి.యువశ్రీ (వేగవరం ఎంజేపీ స్కూల్) ద్వితీయ, జి.శృతి (శోభనాపురం ఎంపీయూపీ స్కూల్) తృతీయ స్థానాలు సాధించారు. థీమ్ 2: వి.గీతిక (సత్రంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్) ప్రథమ, వి.అనుశ్రీ (వట్లూరులోని ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజి) ద్వితీయ, జీఎల్‌వీఎల్ నరసింహ (అప్పలరాజుగూడెం ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ స్కూల్) తృతీయ బహుమతులు గెలుచుకున్నారు.

సీఎం జగన్ కృషితో వాణిజ్య రంగం అభివృద్ధి

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వాణిజ్య రంగం కొత్త పుంతలు తొక్కిందని వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం కమిటీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి గెడ్డం అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 3.50 కోట్ల మంది ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లో జీవిస్తున్నారని వివరించారు. వీరంతా వ్యవసాయం, పాలు, చేపలు ఉత్పత్తి చేస్తున్నారని తెలిపారు. సీఎం జగన్ నాలుగున్నరేళ్లలో వ్యవసాయం, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధికి వందల కోట్ల రూపాయలను ఖర్చు చేశారన్నారు. రైతు భరోసా కేంద్రాలు ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు, యంత్రాలు అందించారని తెలిపారు. మత్స్యపరిశ్రమపై ఆధారపడ్డ వారికి సబ్సిడీపై విద్యుత్ అందిస్తున్నారన్నారు. బ్యాంకు రుణాల ద్వారా పశువులు, పాలకేంద్రాలు ఏర్పాటు చేశారని తెలిపారు. ఫలితంగా వ్యవసాయ అనుబంధ సంస్థలు వాణిజ్య రంగంలో ప్రవేశించి లాభాలు గడిస్తున్నాయని చెప్పారు. వేలాది మంది గ్రామీణ ప్రజలకు ఉపాధి దొరుకుతుందన్నారు. పర్యాటక రంగం, పోర్టుల అభివృద్ధికి సీఎం జగన్ కృషి చేస్తున్నారని కొనియాడారు. వైఎస్ జగన్ మరోసారి సీఎం కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవసాయ రంగాన్ని పట్టించుకోకపోవడం వల్ల రాష్ట్ర ప్రజలకు తీరని నష్టం వాటిల్లిందని గుర్తుచేశారు.

స్త్రీల పట్ల కొనసాగుతున్న వివక్ష



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్) : నేటి సమాజం విద్యాపరంగా, ఆర్థిక పరంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ స్త్రీల పట్ల వివక్షత కొనసాగుతునే ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. నేటి సమాజం స్త్రీ సాధికారత అనే అంశంపై బుధవారం స్థానిక కొత్తపేట సచివాలయంలో అవగాహన సదస్సు డీఎల్ఎస్ఏ, నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు. సదస్సులో రత్నప్రసాద్ మాట్లాడుతూ స్త్రీలను చైతన్య పర్చడం కోసం నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్, జిల్లా న్యాయసేవాధికార సంస్థలు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కుటుంబ పరంగా, మహిళలు పనిచేసే చోట ఏవిధమైన వేధింపులకు లోనైనా జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించవచ్చునని అన్నారు. మానవ అక్రమ రవాణా నేటి సమాజంలో ఒక జఠిలమైన సమస్యగా తయారైందని చెప్పారు. పొరపాటున ఎవరైనా ఇటువంటి సమస్యల్లో ఉంటే ప్రభుత్వం వారికి పునరావాసం కల్పించి అన్ని సౌకర్యాలతో పాటు వృత్తి విద్యను నేర్పిస్తుందని తెలిపారు. సంక్షేమ పథకాలు, ఇతర విషయాల్లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉచిత న్యాయ సహాయం అందిస్తుందన్నారు. మహిళలు ముందస్తు గర్భ స్రావం చేయడం చట్ట విరుద్ధమని, పరీక్షా కేంద్రాలకు కఠిన శిక్ష విధిస్తారని హెచ్చరించారు. నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్ రిసోర్స్ పర్సన్ బి.శ్రీలక్ష్మి, డీసీపీఓ సూర్యచక్రవేణి, సోషల్ వర్కర్ మేతర అజయ్ బాబు, సచివాలయం అడ్మిన్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

ఏలూరు (టూటౌన్): సమగ్ర శిక్షలోని అన్ని విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ కోరారు. ఈ మేరకు సమగ్ర శిక్ష ఉద్యోగులు బుధవారం సమ్మె చేపట్టారు. కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ నాయకులు రాజు, దిలీప్, బాలాజీ, సత్య పాల్గొన్నారు.

మృతులకు సంతాపం

ఏలూరు (టూటౌన్): కైకలూరు వద్ద ఆర్టీసీ బస్సు కాలువలోకి దూసుకెళ్లిన ఘటనలో మరణించిన ముగ్గురికి సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ సంతాపం వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, క్షతగాత్రులకు సంపూర్ణ చికిత్స చేయించాలని ప్రభుత్వాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు.

జూదరుల అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరు సత్రంపాడులో పేకాట శిబిరంపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు బుధవారం ఆకస్మికంగా దాడులు చేశారు. ఎస్ఈబీ సీఐ ప్రసాద్‌కుమార్ దాడి చేసి పేకాటాడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.30,100 స్వాధీనం చేసుకున్నారు. జూదరులను త్రీటౌన్ పోలీసులకు అప్పగించగా, వారు కేసు నమోదు చేశారు.

అంగన్‌వాడీల వంటా వార్పు

ఏలూరు (టూటౌన్): అంగన్‌వాడీల నిరవధిక సమ్మె బుధవారం తొమ్మిదో రోజు కొనసాగింది. ఏలూరు కలెక్టరేట్ వద్ద వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ రవీంద్రనాథ్‌లు మాట్లాడారు.

ఇంధన పొదుపు.. భవిష్యత్‌కు మలుపు



విజేతలకు బహుమతులు అందజేసిన కలెక్టర్

ఏలూరు(మెట్రో): ఇంధన వనరులను అవసరం మేరకు పొదుపుగా వాడుకోవడం ఎంతో ముఖ్యమని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం విద్యుత్ పొదుపుపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తదితరులు పాల్గొన్నారు. ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ పి.సాల్మన్ రాజు మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 20 వరకు జిల్లాలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహించామన్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యుత్ పొదుపుపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులకు కలెక్టరు బహుమతి ప్రదానం చేశారు.

21న ఐక్యతా విజయపథం సభ

ఏలూరు (టూటౌన్): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పేదరిక నిర్మూలనకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జీఎస్ఆర్‌కేఆర్ విజయకుమార్ చేపట్టిన ఐక్యతా విజయపథం పాదయాత్ర సందర్భంగా ఈ నెల 21న ఏలూరులో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ కోరారు. స్థానిక నరసింహారావుపేటలోని సంఘం కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రిటైర్డ్ ఏఎస్ఐ పాకా ప్రభాకర్, నూకపెయ్యి కార్తీక్, జొన్నాథుల పోసిరాజు పాల్గొన్నారు.